'అయ్యా! నేను తేలీ కడుగుతా. నన్ను గంటనుంచీ ఊదరగొట్టేత్తున్నారు. అసలు మీరెవరు! ఈ గుడిసే, చిప్పా క్రా వగైరాలతో మీకు పనేంటి?' ఉత్సాహంగా అడిగాడు రాములు.

దానికి ఆ పెద్ద మనిషి 'చూడు రాములూ! ఈ రోజే నేను భారీ ఎత్తున నిర్మించిన చిత్రం రిలీజ్ అవ్వబోతోంది. ఈ వూరి పచ్చదనం, వాతావరణం చూస్తే, నాకు భవిష్యత్తులో ఈ వూరే నాకు తగిన చోటుగా నిర్ణయించుకొన్నాను. నేను చెప్పినట్లు చెయ్యి వస్తా' అంటూ వడివడిగా కారువైపుకు నడిచి వెళ్ళిపోయాడు.

అంతే! ఒక్కసారిగా బిగుసుకుపోయి దబ్బున క్రింద కూలబడ్డాడు రాములు.

దుమ్ము రేపుకుంటూ, ఆ కారు పట్నం వైపుకు దారి తీసింది.

కథాంజలి
[చక్కని కథల మాస పత్రిక]
స్థాపితం 1938.
విడి ప్రతి ... 50 పైసలు
సంవత్సర చందా ... రూ. 12-00
(రెండు ప్రత్యేక సంచికలతో సహా)
నేడే చందాదారులుగా చేరండి.
అన్ని హిగ్గిన్ బాథమ్స బుక్ స్టాల్సులో దొరుకును.
* కథాంజలి *
నెం. 10, మురుగేశ మొదలి వీధి,
మదరాసు - 600 079.

# ఒక అసమర్థుని కథ

రచన : శ్రీ బి. భీమేశ్వర రావు.

★

(గత సంచిక తరువాయి)

వెంకట్రావ్ మానసిక పరిస్థితిని హెడ్ మాష్టర్ అర్థం చేసుకున్నాడు. చాలా ఆందోళన పడ్డాడు. అతని భుజంపై చేయివేసి 'కాస్త రెస్ట్ తీసుకోండి తరువాత ఇంటికి వెళ్దురు గాని' అని అన్నాడు. ఏమనుకున్నాడో వెంకట్రావ్ మాష్టారు వెంటనే కుర్చీలో కూర్చున్నాడు. మళ్ళీ ఇద్దరి మధ్య కొంతసేపటి వరకు మౌనం. 'ఇందాక కోపంతో మీపై నోరు చేసుకున్నాను. చాలా విచారిస్తున్నాను' అని ఇంకా ఏదో హెడ్ మాష్టర్ అనేలోగా వెంకట్రావ్ చప్పున కుర్చీ నుంచి లేచిపోయాడు.

'ఏం హెడ్ మాష్టరయ్యా. ఇందాక పెంకులెగిరేటట్టు తిట్టేవు. ఇప్పుడేమో విచారిస్తున్నానంటావు. నీకు కూడా జాడీకం లాగ రెండు నాలుకలున్నట్లున్నాయి. జాగ్రత్త. మళ్ళీ నాతో మాట్లాడితే ఆ రెండు నాలికలు తెంపేసి అసలు ఏ నాలుకా లేకుండా చేసేయగలను అని విసురుగా గది నుండి బయటపడి స్కూల్ ఆవరణదాటి పోయేడు.

అతని మనస్సంతా చాలా చికాగ్గా వుంది. రోడ్డు మీద నడుస్తూనే ఉన్నాడు. కాళ్ళు పీకుతున్నాయి. జరిగిపోయిన సంఘటనలు ఎంత వద్దనుకున్నా గుర్తుకు వస్తున్నాయి. ఛీ ఏం పని చేశాడు తను. మచ్చలేని సర్వీసు తనది. అయితేనేం విషపుగీతలు పడనే పడ్డాయి. జరిగినదంతా పీడకల అయిపోతే బాగుణ్ణు. తను ఎప్పటిలా మంచి మాష్టారు అయిపోగలడు. రేపటి నుండి కొత్త జీవితం ఆరంభించాలి. అసలు దీనికంతకీ మూలకారణం జాడీకం అప్పు. ఆ అప్పు ఎప్పుడో తీర్చేయడం జరిగింది,

కాని అప్పు తీర్చడం లేదని జాడీశం దబాయిస్తున్నాడు. తీర్చినట్టు తాను చెప్పుకోడానికి తగిన ఆధారాలు లేవు కనుక తీర్చక తప్పదు. ఈ రోజు ఆ మొత్తమంతా తీర్చేయాలి మరి జన్మలో జాడీశం షాపు మెట్లు ఎక్కకూడదు అక్కడ బట్టలు తీయకూడదు.

బస్ హారన్ చెవుల చిల్లులు పడేటట్టు వినిపించే సరికి ఉలిక్కిపడ్డాడు వెంకట్రావ్ వెను తిరిగి చూసేసరికి తన వీపుని తాకుతూ బస్ ఉంది క్లీనర్ తనను చూసి నానా దుర్భాషలాడుతున్నాడు. వాటిని మౌనంగా భరించి ప్రక్కకు తప్పుకున్నాడు. తగువు పెంచుకోడానికి అతనికి మనస్కరించలేదు. కారణం కెనరా బేంక్ నుండి విత్ డ్రా చేయవలసి ఉంది. టైం అప్పటికే పన్నెండు దాటింది. రోడ్డు వారగా గబగబా నడక ప్రారంభించేడు.

బ్యాంక్ నుంచి డబ్బు విత్ డ్రా చేసి జాడీశం కీయవలసినది పూర్తిగా యిచ్చేసి చెల్లు రసీదు తీసుకొని ఇంటికి చేరుకున్నాడు. టైం సరిగ్గా ఒంటిగంట అయింది భోజనం చేసి పక్క చేరేడు.

అంతలో ఇంటర్ చదువుతూన్న వాళ్ళబ్బాయి కాలేజి నుండి వచ్చాడు. పుస్తకాలు టేబిల్ పై పడేసి 'ఎక్స్కర్షన్ డేట్ సెట్టయింది. వచ్చే నెల మొదటి తేదీన బయలుదేరుతారు, రెండు మూడు రోజులలో డబ్బు యిచ్చేయమన్నారు' అని చెప్పి వంటింట్లోకి చొరబడ్డాడు.

కొడుకు మాటలు వినగానే వెంకట్రావ్‌కి వెర్రిపట్టినట్టయింది. పడుకున్నవాడు స్ప్రింగులా లేచి కూర్చుండిపోయాడు. కొన్ని నిముషాల క్రిందటే అచ్చున్న అప్పణంలా జాడీశంకి జమచేసిన రెండువందల ఏభైరూపాయలు కళ్ళ ముందు మెదిలాయి అతని మనస్సు పూర్తిగా స్వాధీనం తప్పింది. మళ్ళీ పిచ్చిపిచ్చి ఆలోచనలు, కాస్సేపు పళ్ళు కొరికాడు, కాస్సేపు పిడికిళ్ళతో నెత్తి బాదుకున్నాడు. కాస్సేపు జడపదార్థంలా కదలక మెదలక ఉన్నాడు, తర్వాత కొంతసేపటికి నెమ్మదిగా మంచం దిగాడు. ఉన్మాదిలా మనస్సైపోయింది, వంటింట్లోకి పిల్లిలా చొరబడి, పీటపై కూర్చొని భోజనం చేస్తున్న కొడుకు పీకను లేవనెత్తి నడ్డి విరిగేటట్టు వీపు మీద దబదబ బాదడం ప్రారంభించేడు కొడుకు దిగ్భ్రమ చెందేడు 'అమ్మ బాబోయ్!' అని అరుస్తూ తండ్రి నుండి తప్పించుకోడానికి తంటాలు పడసాగేడు. భార్య వంటింట్లో జరుగుతున్న గంద్రగోళం చూసింది. అంట్లు విడిచిపెట్టి ఆతృతతో వచ్చింది. భర్తను చూసి 'ఏం చేశాడు వాడు? గొడ్డును బాదినట్టు బాదుతున్నారు' అని కేకలేసింది 'ఛస్, నువ్వూరుకో ఈ వెధవ ఎక్స్కర్షన్‌కి పోతాడట రెండు మూడు రోజులలో డబ్బు కట్టేయాలట. ప్లీడర్ నోటీస్ యిచ్చినట్టు యిందాక చెప్పేడు. ఎక్కడుంటాది నా దగ్గ అంత సొమ్ము? నేనేమైనా అత్తాదికారినా?! నేనెంత ఇబ్బందిపడి కుటుంబాన్ని పోషించగలుగుతున్నానో వీడికి తెలియదా?! పద్దనిమిదేళ్ళు వచ్చాయ్. ఆపాటి కష్ట సుఖాలు తెలుసుకోలేడూ?!' చిరుబురులాడేడు. 'అదేమిటండీ?! మీరే కదా, పదిరోజుల క్రిందట వాడికి ఫీజు యిమ్మనమని అన్నారు ఇప్పుడేమో వాడిని డబ్బు అడిగినందుకు చావ బాదుతున్నారు. డబ్బుకి యిబ్బందయితే ఏదో మాటల్లో చెప్తారు కాని యిలాగ...' అని అసహ్యించుకుంది.

వెంకట్రావ్ లోని కోపం భార్యపైకి మళ్ళింది. అబ్బ! తనకే ముందలించే స్థితికి చేరుకుందా?! కోపంతో పళ్ళు నూరేడు. చేతులు పైకెత్తి తన జుత్తునే పీక్కోవడం ప్రారంభించేడు. ఇదేమిటి? తను అనుకొన్నదేమిటి? చేస్తున్నదేమిటి? తలకాయ సమంగా పనిచేయకుంటుందా? అసంకల్పిత ప్రేరణ బలదౌర్బల్యమా?'

బపితా వారి ...
ప్రత్యేక తయారింపులు
♦ సీఫార్, ♦ చూస్ట్రీ,
♦ రావ్ టూ ♦ సెలెక్ట్ ఒన్
♦ దట్ సెలెక్షన్.
ఇవే మా ప్రత్యేక తయారింపులైన
జెట్టీలు – బనియన్లు,
: తయారించువారు :
Phone: 22909
BAPITHA KNITTERS
Tirupur - 638 602.

పీల్లేదు ఇంకా జుత్తు పీకేయాలి. జాడీశం తలమీద వెంట్రుకలు లేకుండా చేసేయాలి. జుత్తు గట్టిగా పీక్కుంటూ 'జాడీశం నీవల్లే నేను అనవసరంగా కొడుక్కి కొట్టి బాధించాను. నిన్నుంచను. నీ జుత్తు నుంచను' అని అలువడం ప్రారంభించేడు. భార్య బెంబేలు పడింది. ఏమండి? ఏమండి?! అని, సముదాయించడానికి ప్రయత్నం చేస్తోంది. అలువడం ఆపేశాడు గొణుక్కుంటూ మంచాన్ని నెమ్మదిగా చేరుకున్నాడు. పక్కమీద వాలిపోయి ఆతృతతో తన ప్రక్కకు చేరిన భార్యను చూచి 'అబ్బ! మరి గాబరా పెట్టించకు. తలంతా వేడి ఎక్కి ఉంది, కాస్సేపు నిద్రపోతే అదే సర్దుకుపోతుంది' అని దుప్పటి ముసుగు వేసుకున్నాడు.

కాస్సేపటి వరకు ఆమె భర్త ప్రక్కనే నిల్చొండి పోయింది. పెరడులో పిల్లలగోల ఎక్కువయ్యే సరికి వాళ్ళను మందలించడానికి పెరట్లోకి వెళ్ళింది.

వెంకట్రావ్ నిద్రాదేవిని లోబర్చుకోవడానికి నానా తంటాలు పడుతున్నాడు. ఎప్పటికీ నిద్ర రాకుండా ఉంది. అసహనంగా మూసినకళ్ళు తెరిచాడు. గాలి చొరపడ నీయకుండా శరీరాన్నంటిన దుప్పటి తీక్షణంగా దానికేసే చూడడం ప్రారంభించేడు. నిద్ర పట్టనందుకు కారణం తెలిసింది. గప్న లేచి కూర్చున్నాడు. వేళ్ళతో శక్తికొద్దీ దుప్పటిని చీరడానికి ప్రయత్నించాడు. విఫలుడయ్యాడు. 'అబ్బ! జాడీశం ఎంత దృఢంగా ఉన్నాడు. (ఆ దుప్పటి జాడీశం షాపులో కొన్నది) దృఢంగా ఉన్నా నేను విడిచిపెట్టను' అని గొణుగుతూ టేబిల్ మీదున్న రేజర్ బాక్స్‌ని అందుకున్నాడు. అందులోని బ్లేడ్ తీసి దానితో దుప్పటీ మీద చారలు చారలుగా గీకేశాడు. అంతవిలువైన దుప్పటి రెండు క్షణాల్లో తునాతునకలయింది. ఆ పీలికల్లో జాడీశం శరీర ఖండాల్ని చూడగలిగాడు. విజయోత్సవంతో మంచం దిగి తాను జాడీశం షాపులో తీసుకున్న కర్టెన్ గుడ్డలు, తువ్వాళ్ళు, పట్టులు బ్లేడ్‌తో చీరేసి తెగ సంతోషిస్తూన్నాడు. తన కంటు పాటులో ఉన్న బట్టలన్నీ పూర్తి చేశాడు. మరేవీ చించడానికి కనిపించలేదు. చుట్టూర చూశాడు. తన వెనుక అప్పుడే ప్రవేశిస్తున్న భార్య కనిపించింది భర్త ముఖంలోని క్రూరత్వ భావం చూసి ఆమె భయపడింది. వెనక్కి అడుగు వేయబోయేటంతలో ఆమెను జేం 'నీకేమీ చేయను ఆ జాడీశం గాడి ప్రాణం చీరలో ఉంది' అని చీరకొంగును పట్టి లాగేశాడు ఆమె వద్దని మొర పెట్టుకున్నా వినలేదు. చీరనంతా చేతిలోనికి తీసుకుని ఆమె తొడుక్కున్న లోపావడా, జాకెట్‌ను పరిశీలనంగా చూశాడు. ఆమె భీతితో గజగజలాడి పోతూంది.

'అవి జాడీశం కొట్టువద్ద కొనలేదు కదా' ఉన్మాదంగా అతడడిగాడు. ఆమె 'లేదు' అంది. చీరను మంచంపైకి విసిరి బ్లేడుతో తునాతునకలు చేయ నారంభించాడు.

అదే అదనుకొని అతని భార్య వెంటనే తేరుకొని మరొక చీర చుట్టేసుకొని డాక్టర్ వద్దకు పరుగెత్తింది.

డాక్టర్ వచ్చేసరికి వెంకట్రావ్ మాష్టారు గుడ్డ పేలికలన్నీ ప్రోవుచేసి నిప్పంటించి మండిస్తున్నాడు. పేలికలు మండుతుంటే వినోదంగా చూస్తున్నాడు. అతని దృష్టిలో దహనం చెందుచున్నవి గుడ్డపేలికలు కావు; జాడీశం శవం మాత్రమే.

( సంపూర్ణం )

★

ఎల్లప్పుడూ......
టి. ఎన్. హెచ్. వారి
సైనిక్స్ * ఆర్. ఓ.
కలర్ బనిన్లనే
ఉపయోగించండి.




ఆంధ్రా మరియు ఒరిస్సా ఏజెంట్లు:—
దుర్గా ఏజెన్సీస్, పి. బి. నెం. 84, విశాఖపట్నం-4.

"కథాంజలి"లో వెలువడే కథలన్నీ కేవలం కల్పితము ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు మేము ఏమాత్రం బాధ్యులు కాదు. —సంపాదకుడు.